సాక్షి
అన్నమయ్య జిల్లా

మంగళవారం। 22। ఆగస్టు। 2023



బంగారుతల్లికి బాసట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల రక్షణకోసం అనేక కార్యక్రమాలు, పథకాలు, చట్టాలను అమలు చేస్తున్నాయి. ఆయా పథకాల సమాహారం ఈ కథనం. - 8లో



డాక్టర్‌గా వస్తాడనుకుంటే..

మదనపల్లెకు చెందిన జుబేర్ అహ్మద్ ఫిలిప్పీన్స్‌లో వైద్య విద్యను అభ్యసించేందుకు వెళ్లాడు. అక్కడ నాలుగు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.300	రూ.380
రెండోరకం	రూ.220	రూ.298

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 261 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

మంత్రికి ఘన స్వాగతం



మంత్రి కాకాణికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే నవాజ్ బాషా

బి.కొత్తకోట/రాజంపేట: జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం రాత్రి 10:30 గంటలకు బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్ చేరుకున్నారు. ఆయనకు మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషా, స్థానిక తహసీల్దార్ రఫీక్ అహ్మద్, ఎస్‌ఐ రామమోహన్, ఆర్‌ఐ బాలాజీ స్వాగతం పలికారు. మంగళవారం మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో జరిగే తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాల సమీక్షా సమావేశానికి మంత్రి హాజరవుతారు.

- మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఈనెల 23న రాజంపేటకు రానున్నారని రాజంపేట రెవిన్యూ డివిజనల్ పరిపాలనాధికారి జ్ఞానేశ్వరీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమ పురోగతిపై జరిగే సమావేశంలో మంత్రి పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు. సబ్‌కలెక్టరేట్ సభాభవనంలో జరిగే ఈ సమావేశంలో ఎమ్మెల్యే మేడామల్లికార్జునరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, జిల్లాపరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, కలెక్టరు గిరీషా, జాయింట్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీవో రామకృష్ణారెడ్డి పాల్గొంటారన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి అర్బన్ : జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా స్త్రీ,శిశుసంక్షేమ, సాధికారత అధికారిణి ధనలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 20 అంగన్‌వాడీ కార్యకర్తలు, 37 అంగన్‌వాడీ సహాయకులు, 11 మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఖాళీల వివరాలతో పాటు అవసరమైన దరఖాస్తులను సంబంధిత ఐసీడీయస్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని.. అర్హులు ఈనెల 31వతేదీ సాయంత్రం 5గంటలలోపు దరఖాస్తులు అందజేసి రశీదు పొందాలని కోరారు. మరిన్ని వివరాల కోసం సంబంధిత ఐసిడియస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి 'తిరుమల' రద్దు

కడప కోటిరెడ్డిసర్కిల్ : విజయవాడ–గుణదల మధ్య జరుగుతున్న ఇంటర్ లాంకింగ్ పనుల కారణంగా కడప–విశాఖపట్టణం, విశాఖపట్టణం–కడప మధ్య నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 22 నుంచి 30వ తేదీ వరకు రద్దు చేశారని కడప రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. 17487/17488 రైలు ఈనెల 22 నుంచి 29వ తేదీ వరకు విశాఖ–కడప మధ్య రద్దు చేశారన్నారు. 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకు కడప–విశాఖ మధ్య ఈ రైలును రద్దు చేశారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. రిజర్వేషన్ మొత్తాన్ని రైల్వేశాఖ ప్రయాణికులకు చెల్లింపు చేస్తుందని ఆయన వివరించారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పవిత్ర శ్రావణమాసం సందర్భంగా కడప డిపోనుంచి పలు పుణ్యక్షేత్రాలకు స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు తెలిపారు. కడప డిపో నుంచి పొలతలకు ప్రతి సోమవారం ఉదయం 8.30 గంటలకు బస్సు ఉంటుందన్నారు. అలాగే ప్రతి శనివారం కడప నుంచి గండికి ఉదయం 7 గంటలకు స్పెషల్ బస్సు నడుపుతున్నామన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కడప డిపో నుంచి అరుణాచలంకు కూడా ఈనెల 29, 30 తేదీల్లో ప్రత్యేక సర్వీసులు నడుస్తాయన్నారు. రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఏపీఎస్ఎస్‌డీసీ అధికారి నాగార్జున, జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని డి–బ్లాక్‌లో జిల్లా ఉపాధికల్పనాధికారి కార్యాలయంలో జాబ్‌మేళా ఉంటుందన్నారు. ముత్తూట్‌ఫైనాన్స్, బిగ్ బాస్కెట్ పబ్లిషింగ్ హౌస్ కంపెనీలు ఇందులో పాల్గొంటాయన్నారు. 18–30 సంవత్సరాల మధ్య టెన్త్, ఇంటర్,డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసిన వారు ఇందుకు అర్హులన్నారు. ఇతర వివరాలకు 6300125455, 9063623706 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పట్టుదల మంత్రం.. విజయసూత్రం

- పట్టుదలతో ముందుకు సాగితే విజయం తథ్యం
- తల్లిదండ్రుల ప్రోత్సాహంతో లక్ష్య సాధన
- సొంతంగా నోట్స్ తయారు చేసుకుంటే కోచింగ్ అనవసరం
- రెండో ప్రయత్నంలోనే డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యాను
- 'సాక్షి'తో గ్రూప్స్ ర్యాంకర్ షేక్ ఆయేషా



'ఓటమి ఎదురైనప్పుడే మరింత శ్రమించడం అలవాటవుతుంది... అప్పుడే విజయం ముంగిటకు వచ్చి వాలుతుంది. పట్టుదలతో ముందుకు సాగితే ఎంతటి లక్ష్యమైనా ఇదిగో ఇట్టే మన సొంతమవుతుంది..' ఇదీ ఏపీపీఎస్సీ గ్రూప్–1 విజేత, డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన మదనపల్లెకు చెందిన షేక్ ఆయేషా చెప్పిన మాటలు. పేదరికంలో పుట్టినా.. కష్టాలు పలకరించినా వెనుదిరగలేదు. ఆత్మవిశ్వాసమే ఆయుధంగా మలచుకుని డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికై యువతకు ఆదర్శంగా నిలిచారు. ఆయేషా విజయప్రస్థానం ఆమె మాటల్లోనే..

ప్రొఫైల్

పేరు	: షేక్ ఆయేషా
తండ్రి	: షేక్ అహ్మద్‌బాషా
తల్లి	: షేక్ గౌసియా బేగం
నివాసం	: మదనపల్లె
పాఠశాల విద్య	: ఆరోగ్యమాత ఇంగ్లీషు మీడియం స్కూల్, మదనపల్లె
కళాశాల విద్య	: ఎన్ఆర్ఐ కాలేజీ, తిరుపతి
బీటెక్	: శస్త్రా యూనివర్శిటీ, తంజావూరు, తమిళనాడు

మదనపల్లె సిటీ : లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో ఒకసారి వైఫల్యం ఎదురైనా పట్టుదలతో ముందుకు సాగితే ఎంతటి విజయాన్నైనా ఇట్టే సాధించవచ్చు. సామాజిక మాధ్యమాలు, యూట్యూబ్, ఇంటర్నెట్ లాంటి సాధనాలు అభివృద్ధి చెందిన నేటి రోజుల్లో ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకుని దాన్ని చేరుకోవడం పెద్ద కష్టమేమీకాదు. ప్రణాళిక, పట్టుదల ఉంటే కోచింగ్ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరమే ఉండదు. ప్రతి రోజు దినపత్రికలు చదివి , కరెంట్ ఎఫైర్స్ నోట్స్ సొంతంగా తయారు చేసుకుంటే మంచి ఫలితాలు సాధించగలం. దానికి నేనే ఉదాహరణ.

లక్ష్యసాధనకు ఐదేళ్ల తపస్సు

సివిల్స్ నా చిన్ననాటి కల. బీటెక్ పూర్తి చేసిన తరువాత పినాకా ఆర్గనైజేషన్ నిర్వాహకులు యాదగిరి ,ముంబైలోని ఆర్‌బిఐ గ్రేడ్–బి మేనేజర్ మిథున్‌ల సూచనలు, సలహాలతో సివిల్స్ వైపు దృష్టి సారించా. 2018లో బీటెక్ పూర్తి చేసే సమయంలోనే క్యాంపస్ సెలక్షన్స్‌లో, టీసీఎస్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఎంపికయ్యా. అయినా నా లక్ష్యం గ్రూప్స్ కావడంతో ఉద్యోగంలో చేరలేదు. 2004 ఐఆర్ఎస్ బ్యాచ్‌కు చెందిన యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించే పినాకా స్టూడెంట్స్ కమ్యూనిటీ ఆర్గనైజేషన్ వాట్సప్ గ్రూపులో చేరాను. ఇందులో గ్రూప్స్‌కు ప్రిపేర్ కావడానికి అవసరమైన మెటీరియల్ లభించేది. దీనితో పాటు యాదగిరి పూర్తిగా సహకారం అందించారు. 2018లో గ్రూప్ 1 నోటిఫికేషన్ వెలువడగా దరఖాస్తు చేసుకున్నాను. మొదటి ప్రయత్నంగా 2019లో గ్రూప్–1 ప్రిలిమినరీ, 2020లో మెయిన్స్ పాసై ఇంటర్వ్యూ వరకు వెళ్లాను. కాని ఎంపిక కాలేదు. ఆ సమయంలో తల్లిదండ్రులు అండగా నిలబడి మరింత ప్రోత్సాహాన్ని అందించారు. మరో ప్రయత్నం చేయడానికి మనోధైర్యాన్ని కల్పించారు. దీంతో నాలో పట్టుదల పెరిగింది. 2022 సెప్టెంబర్‌లో గ్రూప్–1 నోటిఫికేషన్ జారీ కాగా ఆత్మస్థైర్యంతో మరింత కష్టపడి పరీక్షకు హాజరై ఉత్తీర్ణత సాధించాను. ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోగలిగాను. ఐదేళ్ల తపస్సు నెరవేరింది.

సాధారణ విద్యార్థినే..

1 నుంచి 10 వరకు ఆరోగ్యమాత ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో చదివాను. ప్రాథమిక పాఠశాలలో సాధారణ విద్యార్థిని. ఉపాధ్యాయులు శ్రీనివాసులు, పద్మావతి, సుబ్బలక్ష్మి, హెచ్ఎం వాసుదేవరావులు అన్ని విధాలుగా ప్రోత్సహించారు. మూడో తరగతి నుంచి నాకు మంచి ఫౌండేషన్ వేశారు. పదిలో 9.8 పాయింట్లు వచ్చాయి. ఇంటర్మీడియట్ తిరుపతి ఎన్ఆర్ఐ కాలేజీలో చేరాను. కాలేజీలో ఫిజిక్స్ అధ్యాపకులు గోవిందరాజులు నన్ను బాగా ప్రోత్సహించారు. ఇంటర్మీడియట్‌లో 982 మార్కులు సాధించాను. బీటెక్ తమిళనాడు తంజావూరులోని శస్త్ర యూనివర్శిటీలో చదివాను. 2018లో బీటెక్ పూర్తి చేశాను.

సొంతంగా నోట్స్ తయారు చేసుకున్నా...

తమిళనాడు తంజావూరు శస్త్ర యూనివర్శిటీలో బిటెక్ పూర్తి చేశా. టెక్స్ట్ బుక్స్, ఎన్‌సీఈఆర్‌టి బుక్స్ చదివి సొంతంగానే నోట్స్ తయారు చేసుకున్నా. క్రమం తప్పకుండా ప్రతి రోజూ దినపత్రికలు హిందూ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, సాక్షి చదవడం అలవాటు చేసుకున్నా. ఆయా పత్రికల్లో వచ్చే ఎడిటోరియల్ కాలమ్స్,కరెంట్ ఎఫైర్స్ చదవడం అలవాటుగా మారింది. రోజుకు తొమ్మిది గంటల పాటు చదివాను.

తల్లిదండ్రులే కొండంత అండ:

గ్రూప్స్ ప్రిపరేషన్‌లో తల్లిదండ్రులు అండగా నిలబడ్డారు. నాన్న షేక్ అహ్మద్‌బాషా చిరు వ్యాపారి. అమ్మ గౌసియాబేగం సాధారణ గృహిణి. నా సక్సెస్‌లో వారి ప్రోత్సాహాన్ని ఎన్నటికీ మరువలేను. ఏ సమయంలోనైనా నేను ఒత్తిడికి గురైతే నన్ను వెన్నుతట్టి నాలో ఆత్మస్థైర్యాన్ని కల్పించేవారు. ఇక స్కూలు రోజుల్లో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, పద్మావతి, సుబ్బలక్ష్మి ,వాసు నా చదువులో ప్రత్యేక శ్రద్ధ చూపేవారు. వారిని ఎప్పటికీ గుర్తుంచుకుంటాను.

ఐఏఎస్ కావాలనేది నా ఆకాంక్ష

ఐఏఎస్ కావాలనేది నా లక్ష్యం. అందుకు శక్తివంచన లేకుండా నా ప్రయత్నాలు చేస్తా. మహిళలను విద్యావంతులు చేయడం, అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించడం, ఆర్థికంగా ఎదిగే విధంగా తోడ్పాటునందిస్తా. ఎక్కడ పని చేసినా అక్కడ నిరక్షరాస్యత లేని ప్రాంతంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ముందుకు సాగుతా.

తన కలే మా కల

ఆయిషా చిన్నప్పటి నుంచి సివిల్స్‌లో రాణించడమే లక్ష్యంగా ఎంచుకుంది. అందు కోసం నిరంతరం శ్రమించింది. తన కలను మాకలగా మార్చుకుని అన్ని విధాలుగా ప్రోత్సహించాం. ఈ సుదీర్ఘప్రయాణంలో చదువులో అవసరమైన అన్నింటిని సమకూర్చాం. దీంతో తన స్వప్నం సాకారం కావడం మాకు సంతోషాన్ని కలిగించింది.

– షేక్ అహ్మద్‌బాషా, గౌసియాబేగం, తల్లిదండ్రులు



చట్టపరిధిలో సత్వర న్యాయం చేయాలి

– ఏఎస్పీ వీబీ రాజ్ కమల్



ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారితో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ

రాయచోటి : స్పందన ద్వారా ఫిర్యాదు చేసిన వారి సమస్యలను చట్టపరిధిలో సత్వర న్యాయం చేయాలని ఏఎస్పీ విబి రాజ్ కమల్ అన్నారు. సోమవారం అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అదనపు ఎస్పీ పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు స్పందన కార్యక్రమం ద్వారా 60 ఫిర్యాదులు అందజేసినట్లు ఏఎస్పీ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు ఆదేశాల మేరకు ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

27వరకు దరఖాస్తు గడువు

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి మూడో విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ మైనార్టీ ఐటీఐల జిల్లా కన్వీనర్ జ్ఞానకుమార్ తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తును iti.ap.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ ఈ నెల 27వ తేదీలోపు చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసిన వారు దరఖాస్తును వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. లేకపోతే అడ్మిషన్ పొందడానికి అర్హులు కారని తెలిపారు. కావున అభ్యర్థులు విద్యార్హతలకు సంబంధించి ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, కులధృవీకరణపత్రం, ఫోటో, ఫోన్ నంబర్, మొయిన్ ఐడీ తీసుకుని దగ్గరలోని ఏ ప్రభుత్వ ఐటీఐలోనైనా సంప్రదించాలని, వెరిఫికేషన్ చేయించుకోవాలని జ్ఞానకుమార్ తెలిపారు.

సౌత్ ఇండియన్ ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం



ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అభిమానులు

మదనపల్లె : మండలంలోని ఆరోగ్యవరం ఫుట్‌బాల్ గ్రౌండ్స్‌లో సోమవారం కేటీ జెసుడియన్, అలెగ్జాండర్ మెమోరియల్ సౌత్ ఇండియా టోర్నమెంట్ అట్టహాసంగా ప్రారంభమైంది. ఆరోగ్యవరం మెడికల్ సెంటర్(ఏఎంసీ) అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జాకబ్ ప్రశాంత్ ముఖ్య అతిథిగా హాజరై ఫుట్‌బాల్ కిక్‌తో టోర్నీని ప్రారంభించారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంచేందుకు ఆరోగ్యవరం యూత్ సభ్యులు ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. టోర్నమెంట్‌కు సౌత్ ఇండియాలోని ఆంధ్ర, కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన 16 జట్లు పాల్గొననున్నాయి. నాలుగు రోజులు ప్రతిరోజు నాలుగు మ్యాచ్‌లు నాక్‌అవుట్ పద్ధతిలో నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. విజేత జట్టుకు రూ.లక్ష, ద్వితీయస్థానానికి రూ.50వేలు, తృతీయస్థానానికి రూ.25వేలు నగదు బహుమతి ఉంటుందని వెల్లడించారు. మొదటిరోజు జరిగిన పోటీల్లో ఆరోగ్యవరం–ఏ జట్టు పరిగి జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 6–2 గోల్స్‌తో విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో కాకినాడ జట్టు – ఆరోగ్యవరం బి జట్టుపై 7–2 గోల్స్‌తో, మూడో మ్యాచ్‌లో కేరళ జట్టు కడప జట్టుపై 4–0 గోల్స్ తేడాతో గెలుపొందాయన్నారు. క్వాలిఫైడ్ రెఫరీలు, సీనియర్ క్రీడాకారులు మ్యాచ్‌లను పర్యవేక్షించారు. రెవరెండ్.నోయల్, నెల్సన్‌బాబు, బబ్లూబాబు, జీపీ.అలెగ్జాండర్ కుటుంబీకులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

28న తెలుగుభాషా రత్న పురస్కారాలు

కడప కల్చరల్ : జిల్లాలో ఐదుగురికి ఈ నెల 28న ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషా రత్న పురస్కారాలు అందజేయనున్నట్లు ప్రముఖ సాహితీ వేత్త విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, సంస్థ కార్యదర్శి జీవీ మనోజ్ కుమార్ తెలిపారు. ఈ నెల 28న ఉదయం పది గంటలకు విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నిర్వహించే ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాషా ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లాలోని కవి డాక్టర్ వెల్లా వెంకటేశ్వరాచారి, కేంద్ర సాహిత్య అకాడమీ బాలల విభాగం పురస్కార గ్రహీత డీకే చదువులబాబు, పోరుమామిళ్లకు చెందిన తెలుగు పండితుడు కుందారపు గురుమూర్తి, సీనియర్ పాత్రికేయులు రేనాటి వెంకటసుబ్బయ్య, కాశినాయన మండలం ఓబులాపురానికి చెందిన వివేకానంద సేవాశ్రమం నిర్వాహకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డిలకు తెలుగుభాషా రత్న పురస్కారాలు అందజేయనున్నట్లు ఆయన వివరించారు.

ఎంఐజీ లేఅవుట్‌తో ఇంటి కల సాకారం

- మధ్య తరగతి ప్రజలకు ఇది వరం
- రెండో విడతలో 21.34 ఎకరాలలో మరో ఎంఐజీ లేఅవుట్ : కలెక్టర్ గిరీషా పీఎస్
- పారదర్శకంగా ప్లాట్ల విక్రయాలు : ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



ఎంఐజీ లేఅవుట్ ఫేజ్–2 బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

రాయచోటి : మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ఎంఐజీ లేఅవుట్లు నిర్మిస్తోందని కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ రాయచోటి నియోజకవర్గం అన్నమయ్య పట్టణాభివృద్ధి సంస్థ ఎంఐజీ లేఅవుట్ ఫేస్–2 ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలోని దిగువ అబ్బవరం గ్రామం సమీపంలో మొదటి విడతలో 31.07 ఎకరాలలో 297 ప్లాట్లు గల ఎంఐజీ లేఅవుట్ వేశామన్నారు. రాష్ట్రంలోని ఎంఐజీ లే అవుట్లలో అన్ని ప్లాట్లు విక్రయించిన మొదటిది అబ్బవరం ఎంఐజీ లేఅవుటే కావడం విశేషమన్నారు. ప్రజల కోరిక మేరకు దిగువ అబ్బవరం ప్రాంతంలోని సర్వే నెంబర్631/13లో దాదాపు 21.34 ఎకరాలలో ఫేస్–2 కింద మరో లే అవుటు వేస్తున్నామన్నారు. ఆసక్తి గల ఔత్సాహికుల నుంచి ప్లాట్లు కేటాయింపు కోసం ఈ నెల 21వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్ వెబ్‌సైటులో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అనంతరం శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మధ్య తరగతి ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు తక్కువ రేటుకే అన్ని వసతులతో సిటీని తలపించే విధంగా ఎంఐజీ లేఅవుట్లు ఉంటున్నాయన్నారు. కలెక్టరేట్ రింగ్‌రోడ్డు నుంచి దిగువ అబ్బవరం లేఅవుట్ వరకు విద్యుత్ దీపాలతో అలంకరిస్తామన్నారు. ఫేస్–2 ఎంఐజీ లేఅవుట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్లాటుపై ఆసక్తి గల వారు 10 శాతం డబ్బులు చెల్లించి రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. ఫేస్–2 ఎంఐజీ లేఅవుట్‌కు సంబంధించి సుందరీకరణ పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే చేతుల మీదుగా ఎంఐజీ లేఔట్ ఫేస్–2 బ్రోచర్‌ను ఆవిష్కరించారు.జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్‌బాషా, లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ గురుమోహన్, వైస్ ఛైర్మన్ నందన్, ప్లానింగ్ అధికారి శైలజ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

రాయచోటి : స్పందనలో అర్జీల ద్వారా వచ్చిన ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ జయరాజ్‌లతో కలిసి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. స్పందన వేదికగా వివిధ సమస్యలపై ప్రజల నుంచి స్వీకరిస్తున్న అర్జీలను అర్హత మేరకు నాణ్యతతో కూడిన విధంగా పూర్తి స్థాయిలో నిర్ణీత కాల వ్యవధిలోనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్పందన అర్జీలపై తక్షణం దృష్టి పెట్టాలన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందనలో పింఛన్, ఆన్‌లైన్ పాస్‌పుస్తకం మంజూరు, భూమి నష్టపరిహారం, హౌసింగ్ బిల్లులు తదితర సమస్యలపై అర్జీలు వచ్చాయి.

ఉద్యానానికి ఊతం

- 25 రకాల ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం
- జిల్లాలో 64.288 వేల హెక్టార్లలో 16.92 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి లక్ష్యం
- రూ. 12.27కోట్లతో పథకాల అమలుకు కార్యాచరణ



ఖాజీపేట మండలం చెన్నముక్కపల్లె సమీపంలో సాగులో ఉన్న పండ్ల తోట

కడప అగ్రికల్చర్: ఉద్యాన పంటల సాగులో వైఎస్సార్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉండడంతో ఉత్పత్తిని మరింత పెంచడానికి వివిధ పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాలో ప్రస్తుతం వ్యవసాయ పంటలతోపాటు చీనీ, అరటి, మామిడి, నిమ్మ, బొప్పాయి. పసుపు, కేపీ ఉల్లి, కూరగాయలు, తమల పాకులు ఇతర పంటలు 64,228 హెక్టార్ల విస్తీర్ణంలో సాగవుతున్నాయి. 16.92 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి చేస్తున్నారు. దీంతో 2023–24లో ఉద్యాన సమగ్రాభివృద్ధి పథకం, రాష్ట్రీయ కృషి వికాస యోజన పథకం కింద రూ.12.28 కోట్ల ఆర్థిక ప్రణాళికతో రైతులను లాభాల బాటలో నడిపించాలని సంకల్పించింది.

పరిశ్రమల అభివృద్ధికి చేయూత

ఆంధ్ర ప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ప్రోత్సాహంతో తొలిసారిగా వైఎస్సార్ జిల్లాలో చిన్న తరహా ఆహార శుద్ధి పరిశ్రమలు, డ్వాక్రా మహిళలు, రైతు ఉత్పత్తి సహకార సంఘాలతో ఏపీఎంఎఫ్ఎంఈ పథకం కింద 2023–24లో 360 యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో యూనిట్ అభివృద్ధికి 35 శాతం లేదా గరిష్ఠంగా రూ.10 లక్షల రాయితీ ఇవ్వనుంది. ప్రస్తుతం పులివెందులలో అరటి ఉత్పత్తి ఆహార శుద్ధి పరిశ్రమ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

జిల్లాలో అమలు చేయనున్న పథకాలు ఇవీ..

గోదాముల నిర్మాణం : రూ.4.58 కోట్లతో గోదాముల నిర్మాణానికి చేయూత నివ్వనుంది. రూ. 2.62 కోట్లతో 131 ప్యాక్ హౌస్‌లు, రూ.1.4 కోట్లతో శీతల గోదాములు, రూ.21 లక్షలతో రీపెండింగ్ చాంబర్స్, 4 లక్షల 38 వేలతో ఉల్లి నిల్వ గోదాములు, రూ. 31 లక్షల 50 వేలతో శీతల గదులు నిర్మించనుంది.

రూ.109.75 లక్షలతో ఫారంపాండ్స్ : వర్షాభావ పరిస్థితుల్లో కూరగాయలు, పండ్ల తోటలకు రక్షక తడులు ఇచ్చి కాపాడుకునేందుకు ప్రభుత్వం నీటి కుంటలు తవ్వించనుంది. 50 శాతం రాయితీని రూ.75 వేలకు మించకుండా ఇవ్వనుంది. రూ.20 లక్షల వరకు రైతు సంఘాలకు నీటి కుంటలు నిర్మాణానికి చేయూత ఇవ్వనున్నారు. రూ.28.40 లక్షలతో పాలీ హౌస్, షేడ్ నెట్లు నిర్మించనున్నారు.

ఉత్పాదకత పెంచడమే లక్ష్యం



జిల్లాలో ఉద్యాన పంటల సాగుతో ఉత్పాదకత పెంచేందుకు ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తోంది. జిల్లాలో ప్రస్తుతం 16.92 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి ఉంది. ఈ ఏడాది ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఉద్యాన రైతులు సద్వినియోగం చేసుకుని సాగును పెంచాలి.

– ఐజీ మైఖేల్ రాజీవ్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

- కూరగాయలు, పండ్లతోటలు సాగు చేసే రైతులు అధిక దిగుబడులు సాధించేలా సహకారం అందించడానికి ప్లాస్టింగ్ మల్చింగ్‌కు రూ.112 లక్షలు, యాంటీబర్డ్ నెట్‌కు రూ.8.96లక్షలు మంజూరు చేయనున్నారు. రెండు, మూడేళ్లపాటు పండ్లతోటలు, హైబ్రీడ్ కూరగాయలు, పూల తోటల నిర్వహణకు రాయితీ ఇవ్వనున్నారు.
- రైతుల శ్రమను తగ్గించి, ఉత్పాదకత పెంచేందుకు రూ.24.8 లక్షలతో యాంత్రీకరణను ప్రోత్సహించనున్నారు. రూ.15 లక్షలతో ట్రాక్టరు, రూ.3 లక్షలతో చిన్న ట్రాక్టర్ పవర్ ట్రిల్లర్ ఇవ్వనున్నారు. మొక్కల సంరక్షణ కింద రూ.5.28లక్షలతో స్ప్రేయర్లు ఇవ్వనున్నారు.

జిల్లాలో ఉద్యాన పంటలసాగు వివరాలు

ఉద్యానపంట రకం	సాగువిస్తీర్ణం (హెక్టార్లలో)	ఉత్పత్తి (టన్నుల్లో)
పండ్లు	42699.40	11,71,865
కూరగాయలు	12165, 60	2,84,853
సుగంధ ద్రవ్యాలు	7532.60	18,552
పూలు	1890.69	15,888
పథకం పేరు		**సబ్సీడీ (రూ.లక్షల్లో)**
పండ్ల తోటల అభివృద్ధి	909	95.71
హైబ్రీడ్ కూరగాయల ఉత్పత్తి	90	18.00
పూల తోటలు	310	49.60
2 సంవత్సరాల తోటల నిర్వహణ పథకం	301.09	11.63
3 సంవత్సరాల తోటల నిర్వహణ పథకం	305.83	13.31
రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో..		
3 సంవత్సరాల పండ్ల తోటల నిర్వహణ	37	1.80
కూరగాయలసాగు	93.92	14.00
శాశ్వత పందిళ్లు	7	17.50

కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు


గాయపడిన స్వాతి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పట్టెంవాండ్లపల్లి పంచాయతీ దిగవ కుక్కలపల్లిలో సోమవారం కుక్కలు వీరంగం సృష్టించాయి. ఇదే గ్రామంలో పోలియోతో బాధ పడుతున్న శ్రీరాములు కుమార్తె స్వాతి (21), మరో వ్యక్తి ఆదినారాయణ (60)లపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. అనంతరం లక్ష్మీపతి అనే రైతుకు చెందిన ఆవు, దూడను కూడా తీవ్రంగా గాయ పరిచాయి. బాధితులు 108 వాహనం ద్వారా ఆసుపత్రిలో చికిత్స పొందారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


దూళ్ల యల్లారెడ్డి (ఫైల్)

సిద్దవటం : ఇంటి నుంచి వెళ్లిపోయిన భర్త దూళ్ల యల్లారెడ్డి (42) తిరిగి రాక పోవడంతో అతని భార్య దూళ్ల సుప్రజ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దవటం మండలంలోని నేకనాపురం గ్రామానికి చెందిన దూళ్ల యల్లారెడ్డి 2022 డిసెంబర్ 6న బేల్దారి పనికి అని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో వారి కుటుంబీకులు.. బంధువుల గ్రామాలు, మరికొన్ని దూర ప్రదేశాల్లో గాలింపు చర్యలు చేట్టారు. అయినా ఎక్కడా కనిపించలేదు. దీంత ఆయన భార్య దూళ్ల సుప్రజ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మాతృత్వ ఫెర్టిలిటీ సెంటర్ ప్రారంభం


సెంటర్‌ను ప్రారంభిస్తున్న వైద్యులు

నంద్యాల టౌన్ : ప్రముఖ కార్పొరేట్ ఫెర్టిలిటీ సెంటర్ అయ్యినటువంటి మాతృత్వ ఫెర్టిలిటీ సెంటర్ తమ 5వ శాఖను నంద్యాల పట్టణం పద్మావతి నగర్‌లో సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, పట్టణ వైద్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫెర్టిలిటీ సెంటర్ వైద్యులు డాక్టర్ పద్మలత, రేఖా రాజేష్, సరిత, శివ జ్యోతి మాట్లాడుతూ రాయలసీమలోనే అత్యంత అధునాతన వైద్య సదుపాయలతో సంతానోత్పత్తి కేంద్రం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

బంగారుతల్లికి బాసట

- బాలికల సంరక్షణ కోసం అనేక చట్టాలు
- సంక్షేమం కోసం పలు పథకాలు
- పాటు పడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



కడప కోటిరెడ్డిసర్కిల్ : సమాజ మనుగడకు మాతృమూర్తి తప్పనిసరి. నేటి బాలలే రేపటి పౌరులు. అందులో నేటి బాలికలే రేపటి సమాజంలో తల్లులు కాబట్టి బాలికలను తప్పనిసరిగా సంరక్షించుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల రక్షణకోసం అనేక కార్యక్రమాలు, పథకాలు, చట్టాలను అమలు చేస్తున్నాయి.

చట్టాలు..

లింగ నిర్ధారణ నిషేధ చట్టం-1994



గర్భస్థ దశలో ఆడశిశువుల హత్యలు నివారించేందుకు ఈ చట్టాన్ని రూపొందించారు. తల్లికి లేదా బిడ్డ ఆరోగ్యానికి ప్రమాదం ఉందని లేదా జన్యు సంబంధిత వ్యాధులు సంభవించే ప్రమాదం ఉందని వైద్యులు అధికారికంగా గుర్తించిన సందర్భంలోనే గర్భస్రావానికి అనుమతి ఉంటుంది. మిగిలిన ఏ కారణంతో అయినా గర్భస్రావం చేయడం చట్టరీత్యా నేరం. స్కానింగ్ సెంటర్లు, వైద్యులు ఈ రకమైన చర్యలకు పాల్పడకుండా నిరోధించేందుకు గాను కలెక్టర్‌కు పూర్తి అధికారాలు కల్పించారు.

గృహ హింస నిరోధక చట్టం-2005



బాలికలపై గృహంలోని సమీప బంధువులు కూడా లైంగిక దాడులు, హింసకు పాల్పడటం అక్కడక్కడా జరుగుతూ ఉంటుంది. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారు, తల్లిదండ్రులు, సమీప బంధువులైనా వారిని శిక్షిస్తారు. అలాగే మానవ అక్రమ రవాణా నిరోధకచట్టం-1958, స్త్రీల అసభ్య చిత్రీకరణ నిషేధ చట్టం-1986, ఏపీ దేవదాశి చట్టం-1988 తదితరాలు ఉన్నాయి.

బాలల న్యాయ (రక్షణ, పరిరక్షణ) చట్టం-2000



బాలబాలికలకు అన్ని రకాల రక్షణ కల్పించేందుకు ఉద్దేశించిన చట్టమిది. బాలల అవసరాల ఆధారంగా వారి పరిరక్షణకు, వారితో స్నేహపూర్వక ధోరణితో మెలగాలి. అవసరమైన సేవలు అందించేందుకు ఈ చట్టం దోహద పడుతుంది.

లైంగిక దాడుల నియంత్రణ చట్టం-2012

మైనర్లపై జరిగే లైంగిక దాడులను అరికట్టేందుకు రూపొందించిన చట్టమిది. అసభ్య చిత్రీకరణ కోసం (పోర్నోగ్రఫీ) బాలలను ఉపయోగిస్తే ఈ చట్టం ప్రకారం ఐదేళ్లపాటు జైలు శిక్ష విధిస్తారు. రెండవసారి ఇదే నేరానికి పాల్పడితే ఏడేళ్ల జైలు శిక్షతోపాటు జరిమానా కూడా విధిస్తారు. లైంగికంగా బాలలను వేధిస్తే ఐదేళ్లకు తగ్గకుండా జైలు శిక్ష, నేర తీవ్రత ఆధారంగా ఈ శిక్షను ఏడేళ్ల వరకు పొడిగిస్తారు. తీవ్ర లైంగిక దాడికి పాల్పడితే యావజ్జీవ శిక్ష విధిస్తారు. ఈ నేరాలను విచారణ చేసేందుకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేశారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఈ చట్టం అమలు తీరును పర్యవేక్షిస్తుంది.



బాల్య వివాహ నిషేధ చట్టం-2006

ఈ చట్టం ప్రకారం బాల్య వివాహాలు చేయడం పూర్తిగా నిషేధం. ఈ చట్టం ప్రకారం వివాహ వయసు పురుషునికి 21, స్త్రీలకు 18 ఏళ్లు నిండి ఉండాలి. మైనర్‌లను వివాహం చేసుకుంటే రూ.లక్ష జరిమానా, రెండేళ్ల జైలు శిక్ష, రెండూ విధించేందుకు అవకాశం ఉంటుంది. బాల్య వివాహాలను ఎవరైనా ప్రోత్సహించినా, కుదిర్చినా, చేయించినా తల్లిదండ్రులు, సంరక్షకులు శిక్షార్హులే. జిల్లా ప్రధాన న్యాయాధికారి ఈ చట్ట పరిధిలో కేసులను విచారణ చేస్తారు. బాల్య వివాహాన్ని ఎవరైనా జరిపిస్తున్నట్లు సమాచారం అందితే.. ఆ వివాహాన్ని నిరోధిస్తూ నిషేధాజ్ఞలు జారీ చేసే అవకాశం జిల్లా జడ్జికి ఉంటుంది.



సంక్షేమ పథకాలు..

బాలికల ఉన్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయి.

సుకన్య సమృద్ధి యోజన



కేంద్ర ప్రభుత్వం 2016 నుంచి దేశ వ్యాప్తంగా సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని అమలు చేస్తోంది. బాలికల కోసం తపాలా శాఖలో ఈ సేవ అందుతోంది. కుటుంబంలో ఇద్దరు ఆడపిల్లలు ఉంటే తపాలా శాఖలో డిపాజిట్ చేసిన సొమ్ముకు రెట్టింపు సొమ్ము వచ్చేలా ఈ పథకం అమలు చేస్తున్నారు. 18 ఏళ్ల వయసు వరకు అమ్మాయి పేరున ప్రతి నెలా తపాలా కార్యాలయంలో నగదు డిపాజిట్ చేయవచ్చు. ప్రతి నెల రూ.1000 నుంచి ఎంతైనా జమ చేయవచ్చు. అధిక వడ్డీతో అమ్మాయి వివాహ వయసు నాటికి ఎక్కువ మొత్తంలో నగదు వస్తుంది.

బేటీ బచావో-బేటీ పఢావో



ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2015లో ప్రారంభించింది. సమాజంలో లింగ వివక్షను తగ్గించడానికి బాలికల చదువుకు ప్రాధాన్యత ఇచ్చేందుకు అమలు చేస్తున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం బాలికల విద్య కోసం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలను ఏర్పాటు చేసింది.

ఐదుగురిపై కేసు నమోదు

కడప అర్బన్ : కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో సోమవారం మద్యం సేవించిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రంగస్వామి తెలియజేశారు.

ఇల్లు రాసివ్వలేదని తండ్రిపై హత్యాయత్నం

రక్షణ కల్పించాలని జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు


డీఏఓ శేషయ్యకు ఫిర్యాదు చేస్తున్న బాధితుడు కృష్ణ

మదనపల్లె : నివాసం ఉంటున్న ఇంటిని కొడుకు, కోడలికి రాసివ్వలేదని తనపై హత్యాప్రయత్నం చేయడంతో భయంతో ఇంటి నుంచి పారిపోయానని, తనకు రక్షణ కల్పించాలని వలసపల్లె నవోదయ కాలనీకి చెందిన కృష్ణ జగనన్నకు చెబుదాంలో అర్జీ సమర్పించారు. ఐదు రోజుల క్రితం ఇంటిలో పడుకున్న తనను కుమారుడు గౌతమ్‌కుమార్, కోడలు సుప్రియ రాత్రి 11 గంటల సమయంలో కొట్టడమే కాకుండా గొంతుపై కాలువేసి తొక్కి చంపేందుకు ప్రయత్నించారన్నారు. ఆస్తి రాసి ఇవ్వాలని లేకుంటే చంపేస్తామని బెదిరించి ఇంటి దస్తావేజులను లాక్కుని తరిమేశారన్నారు. దీంతో ప్రాణభయంతో తాను ఇంటికి వెళ్లకుండా తెలిసిన వారి వద్ద తలదాచుకుంటున్నానని, ఇల్లు తప్ప తనకు మరో ఆధారం లేదని వాపోయాడు. అధికారులు తన కొడుకు, కోడలును పిలిపించి విచారించి తనకు న్యాయం చేయాల్సిందిగా డీఏఓ శేషయ్యను వేడుకున్నాడు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

భార్యకు తీవ్ర గాయాలు


గౌస్‌ఖాన్ మృతదేహం

రామాపురం : మండలంలోని సుద్దమళ్ల పంచాయతీ ఎర్రంరెడ్డిగారిపల్లె దర్గాకు వెళ్లే క్రాస్ రోడ్డు వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నీలకంఠ్రావుపేటకు చెందిన బేల్దారి మేస్త్రీ పఠాన్ గౌస్‌ఖాన్(45) జ్వరం వస్తుండటంతో భార్య ఆయిషాతో కలిసి రాయచోటి ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నాడు. వారు బైక్‌పై తిరుగు పయనమయ్యారు. నీలకంఠ్రావుపేటకు చెందిన తౌషిద్ అలీ, షేక్ దాదాపీర్ ద్విచక్రవాహనంపై రాయచోటి వైపు వెళ్తున్నారు. ఎదురెదురుగా వస్తున్న వారి వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గౌస్‌ఖాన్, ఆయిషాకు తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని 108లో కడప రిమ్స్‌కు తరలించారు. అప్పటికే గౌస్‌ఖాన్ మృతి చెందినట్లు వైద్యులు తెలియజేశారు. ఆయిషా తలకు తీవ్రంగా గాయం కావడంతో రిమ్స్‌లో చికిత్స పొందుతోంది. వారికి ఐదుగురు సంతానం ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు.

బైక్‌లు ఢీకొని వ్యక్తి దుర్మరణం


మృతి చెందిన నరసింహులు

పోరుమామిళ్ల : పట్టణ శివారులోని మైదుకూరు రోడ్డులో రైసు మిల్లు దగ్గర సోమవారం సాయంత్రం రెండు బైకులు ఢీకొనడంతో బి.మఠం మండలం లింగాలదిన్నెపల్లెకు చెందిన జింకా నరసింహులు (58) దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదంలో మండలంలోని కప్పలపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ పుల్లయ్య (విద్యుత్ కాంట్రాక్టర్), అతని సహాయకుడు పాయలకుంట్లకు చెందిన యువకుడు గాయపడ్డారు. పుల్లయ్య అతని సహాయకుడు ఒక బైక్‌లో వెళ్తుండగా.. నరసింహులు మరో బైక్‌పై వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. నరసింహులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ విషయమై ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డిని వివరణ కోరగా.. మృతుడి కుమారుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

చెట్టును ఢీకొన్న ఆటో

అట్లూరు : మండల పరిధిలోని కడప - బద్వేలు ప్రధాన రహదారిపై రెడ్డిపల్లె వద్ద ఆటో చెట్టును ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని ఎస్.వెంకటాపురం మలినేనిపట్నం కాలనీకి చెందిన నరసింహ కడపలో ఆటో రిపేరు చేయించుకుని ఇంటికి తిరిగి వస్తున్నాడు. రెడ్డిపల్లె పెట్రోలు బంకు సమీపాన ఆటో చెట్టును ఢీకొనడంతో నరసింహకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సమాచారం ఇవ్వడంతో.. వెంటనే 108 వాహనం వచ్చి కడప రిమ్స్‌కు తీసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆటో దెబ్బతినింది.

వృక్షం నరుకుతూ.. కిందపడి

కడప అర్బన్ : కడప నగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాయిబాబా హాలు వెనుక వైపున ఆదివారం మారుతీనగర్‌కు ఖాదర్‌బాషా (22) అనే యువకుడు చెట్టును నరుకుతుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని కడప రిమ్స్‌కు తరలించారు. తరువాత మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తీసుకెళ్లారు. అక్కడ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎస్.వి. నాగరాజు తెలియజేశారు.

జూదరుల అరెస్ట్

లింగాల : మండల పరిధిలోని గుణకణపల్లె, లింగాల గ్రామాల్లోని పేకాట స్థావరాలపై ఆదివారం రాత్రి ఎస్‌ఐ రవికుమార్ దాడులు నిర్వహించారు. పదవీ బాధ్యతలు చేపట్టిన రోజే ఆయన ఈ దాడులు నిర్వహించడం గమనార్హం. లింగాలలో 10 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.5,400 స్వాధీనం చేసుకున్నారు. గుణకణపల్లెలో 8 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.2,600 స్వాధీనం చేసుకున్నాన్నారు. వారిపై కేసు నమోదు చేశారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టి, శాంతి భద్రతలను పరిరక్షిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

డాక్టర్‌గా వస్తాడనుకుంటే.. శవమై వచ్చాడు

ఫిలిప్పీన్స్‌లో రోడ్డు ప్రమాదంలో మెడికో మృతి


జుబేర్ అహ్మద్ (ఫైల్)


జుబేర్ అహ్మద్ అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : కుమారుడు డాక్టర్ కావాలని ఆ తల్లిదండ్రులు ఎన్నో కలలు కన్నారు. ఎంతో వ్యయప్రయాసాల కోర్చి.. ఫిలిప్పీన్స్‌కు పంపించారు. అయితే అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖసాగరంలో మునిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లెకు చెందిన జుబేర్ అహ్మద్(23) ఫిలిప్పీన్స్‌లో వైద్య విద్యను అభ్యసించేందుకు వెళ్లాడు. అక్కడ నాలుగు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. దీంతో పట్టణంలోని త్యాగరాజువీధికి చెందిన జుబేర్ అహ్మద్ తండ్రి అలీఖాన్ ఎమ్మెల్యే నవాజ్‌బాషాను కలిసి తన కుమారుడు కుమారుడి మృతదేహాన్ని స్వస్థలానికి తెప్పించేందుకు సహాయం చేయాల్సిందిగా కోరారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా కేంద్ర విదేశాంగ శాఖ అధికారులు, ఫిలిప్పీన్స్‌లోని ఎంబసీ అధికారులతో సంప్రదించి మృతదేహాన్ని మదనపల్లెకు తెప్పించారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక కబరస్థాన్‌లో జరుగుతున్న వైద్య విద్యార్థి జుబేర్ అహ్మద్ అంత్యక్రియల్లో ఎమ్మెల్యే పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఫిలిప్పీన్స్‌లో జుబేర్ అహ్మద్ చివరి ఏడాది వైద్య విద్యను అభ్యసిస్తున్నాడని, నాలుగు నెలల్లో కోర్సు పూర్తయి ఇండియాకు వచ్చేవాడని కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. డాక్టర్‌గా తిరిగి వస్తాడనుకుంటే.. శవమై రావడంతో కుటుంబ సభ్యుల శోకానికి అంతు లేకుండా పోయింది. వారు గుండెలవిసేలా రోదించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


ఖాదర్‌వలీ (ఫైల్)


మృతి చెందిన ఖాదర్‌వలీ

మదనపల్లె : పట్టణంలో సోమవారం ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎగువకురవంక రవీంద్రనగర్‌కు చెందిన ఖాదర్‌బాషా, వహీదా దంపతుల కుమారుడు ఖాదర్‌వలీ(27) డ్రైవర్‌గా బెంగళూరులో పని చేస్తున్నాడు. ఈ నెల 19న మదనపల్లెకు వచ్చాడు. ఆదివారం రాత్రి స్నేహితులతో కలిసి బయటకు వెళ్లాడు. కుమారుడు బయటకు వెళ్లడంతో ఇంటిలో ఒంటరిగా ఉన్న తల్లి కూతురి వద్దకు వెళ్లింది. అయితే అర్ధరాత్రి తర్వాత ఇంటికి వచ్చిన ఖాదర్‌వలీ చెప్పులు బయటే వదలి గేటు దూకి ఇంట్లోకి వెళ్లాడు. ఇంటి మెట్లపై ఉన్న గ్రిల్‌కు నీటిపైపుతో ఉరి వేసుకున్నాడు. ఉదయం గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న టూటౌన్ సీఐ మురళీకృష్ణ, పోలీసులు.. మృతదేహాన్ని పరిశీలించారు. ఉరివేసుకుని పై నుంచి దూకడంతో పైప్ తెగి కింద పడిపోయాడని ప్రాథమికంగా నిర్ధారించారు. తల్లి వహీదా ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి తాలూకా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యకు ప్రయత్నించిన శివజ్యోతి

మదనపల్లె : భర్త తనను ఇంటి నుంచి గెంటివేసి, రెండోపెళ్లి చేసుకున్నాడని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగకపోవడంతో ఓ వివాహిత ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన సోమవారం మదనపల్లెలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కురవంకకు చెందిన దేరంగుల రమేష్, బాబూకాలనీకి చెందిన శివజ్యోతికి 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. పిల్లలు లేరు. దీంతో శివజ్యోతిపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ రమేష్ కోర్టులో విడాకుల కోసం దరఖాస్తు చేశాడు. శివజ్యోతి తండ్రితో కలిసి బాబూకాలనీలో నివాసం ఉంటోంది. ఈ క్రమంలో మొదటిభార్యకు తెలియకుండా చరితను రెండో వివాహం చేసుకుని ఒక బిడ్డకు తండ్రి అయ్యాడు. విషయం తెలుసుకున్న శివజ్యోతి శనివారం భర్త ఇంటి ముందు తనకు న్యాయం చేయాలంటూ నిరసన వ్యక్తం చేసింది. భర్తపై తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రెండు రోజులుగా పోలీసులు ఫిర్యాదుపై స్పందించకపోవడం, భర్తపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో శివజ్యోతి మనస్తాపం చెంది ఆదివారం నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం ఆమె తేరుకోకపోవడంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించారు.

వేర్వేరు ప్రాంతాల్లో మరో నలుగురు..

వేర్వేరు ప్రాంతాల్లో మరో నలుగురు ఆత్మహత్యకు ప్రయత్నించారు. మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారిపల్లె వెంకటేశ్వరపురానికి చెందిన రామస్వామి భార్య డి.శివమ్మ(47) కుటుంబ సమస్యలతో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అదే విధంగా గుర్రంకొండ మండలం టమాట మార్కెట్ ప్రాంతానికి చెందిన రమణ భార్య జి.రాధ(25) కుటుంబ సమస్యలతో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గుర్రంకొండ మండలం మేకలవారిపల్లెకు చెందిన సి.రెడ్డెప్ప(69) కుటుంబ సభ్యులు మద్యం తాగవద్దని మందలించినందుకు మనస్తాపంతో.. పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వాల్మీకిపురం మండలం దిగువబూడిదవేడుకు చెందిన రఘునాథరెడ్డి భార్య సరస్వతి(45) కుటుంబ సమస్యలతో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఆయా సంఘటనల్లో కుటుంబసభ్యులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం కోలుకుంటున్నారు.